## అక్రమ నిర్మాణాలు కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

బన్సీలాల్ పేట్, మార్చి 21 : పద్మారావు నగర్ లోని స్కందగిరి కాలనీలో అక్రమ నిర్మాణాలను శుక్రవారం హైడ్రా అధికారుల సమక్షంలో జీహెచ్ఎంసీ టౌన్ ప్లాన్ సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. తమ కాలనీ లో చేపట్టిన నిర్మాణం అక్రమమని తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఇటీవల హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేసి అది అక్రమమేనని తేలడంతో నిర్మాణాన్ని కూల్చి వేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా సీఐ ఆదిత్య, బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుష్మిత, సిబ్బంది జగదీశ్, భూషణ్ పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు




ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్ పేట్, మార్చి 21 : ముస్లింలు చేపట్టిన రంజాన్ ఉపవాస దీక్షలో విజయవంతంగా పూర్తి కావాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తాము ఆకాంక్షిస్తున్నామని బన్సీలాల్ పేట్ కార్పొరేటర్ హేమలత అన్నారు. తమ నివాసం వద్ద శుక్రవారం, బీఆర్ఎస్ పార్టీలోని మైనార్టీ విభాగం నాయకులు కార్యకర్తల కోసం సాయంకాలం రంజాన్ ఉపవాస దీక్ష విరమణ సందర్భంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి పండ్లు తినిపించి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ జావేద్, ఫహీం, అయూబ్, రుక్మొద్దీన్, అన్వర్, ఆజం, సల్మాన్, పాషా, లక్ష్మీపతి, నర్సింగ్‌రావు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, రమేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే ముఠా గోపాల్
- ముషీరాబాద్, రాంనగర్‌లో వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం




రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్లు

ముషీరాబాద్, మార్చి 21: బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. ముషీరాబాద్, రాంనగర్ డివిజన్ లలో రూ . 34 లక్షలతో చేపట్టనున్న వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి సౌకర్యాలు కల్పించడంతోపాటు చక్కటి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గతంలో నిధులు మంజూరై వాయిదా పడిన రోడ్డు నిర్మాణాలను ప్రత్యేక చొరవ తీసుకొని తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అధికారులు జవాబు దారీగా పనిచేయాలని సూచించారు. దశలవారీగా అన్ని బస్తీల్లో అంతర్గత రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుప్రియ నవీన్ గౌడ్, రవి చారి, జీహెచ్ఎంసీ డీఈ గీత, ఏఈ మురళి, బీఆర్ఎస్ నాయకుడు ముఠా, జయసింహ, కొండా శ్రీధర్ రెడ్డి, ఆకుల అరుణ్, దీన్ దయాల్ రెడ్డి, శివ ముదిరాజ్, రాజు పాల్గొన్నారు.

**ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత..**

చిక్కడపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్ నగర్ లో నల్ల పోచమ్మ దేవాలయం కు నూతనంగా ఏర్పాటుచేసిన కమాన్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దివంగత భూకాల నారాయణ యాదవ్ స్మారకర్థం ఆయన కుమారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బీఎన్ శ్రీనివాస్ యాదవ్ ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, హాజరై గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహల తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మీ గణపతి దేవాలయం చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌కుమార్, పాశం రవి,ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, జి పరుశురాం, పున్న సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, కృష్ణ యాదవ్, బాబ్జి, గణేశ్ ,బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, నాయకులు నవీన్ కుమార్, రత్న సాయిచంద్, శ్రీకాంత్, రఘురాం పాల్గొన్నారు.



నల్ల పోచమ్మ ఆలయం కమాన్‌ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

## యువత వ్యాపారవేత్తలుగా ఎదగాలి



బిజినెస్ మేనేజ్‌మెంట్ ఉత్సవాలను ప్రారంభిస్తున్న దర్శకుడు శేఖర్ కమ్ముల

బన్సీలాల్ పేట్, మార్చి 21 : బిజినెస్ మేనేజ్‌మెంట్ రంగాన్ని ఎంచుకున్న యువత అందులోని మెలుకువలను నేర్చుకుని, సృజనాత్మకత, సాంకేతికతను వినియోగించుకుని, వ్యాపారాలు మొదలుపెట్టి, భవిష్యత్తులో గొప్ప వ్యాపారవేత్తలుగా ఎదగాలని, తమతో తల్లిదండ్రులకు, కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. సికింద్రాబాద్, పద్మారావు నగర్ లోని సర్దార్ పటేల్ కళాశాలలో శుక్రవారం 'సమన్వయ' పేరుతో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల ఉత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కళాశాల పాలకమండలి చైర్మన్ హరినాథ్‌రెడ్డి, కార్యదర్శి బీవీ రంగారెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ హేమలత, వైస్ ప్రిన్సిపాల్ అమర్నాథ్‌శర్మ, ఎంబీఏ డైరెక్టర్ డాక్టర్ అనుప యాదవ్, హెచ్‌ఓడీ పల్లవి, పరిపాలన అధికారి రాహుల్ యాదవ్ పాల్గొన్నారు.

## వర్ధంతి సభలను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: భారత స్వాతంత్ర్య అమరవీరులు కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న వర్ధంతి సభలను విజయవంతం చేయాలని ప్రొఫెసర్ వెంకట దాస్ పిలుపునిచ్చారు. డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వర్ధంతి సభల వాల్ పోసర్‌ను ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ వెంకట దాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఉచిత విద్య, వై ద్యం అందించలేని స్థితిలో ఉన్నదని అన్నారు. మోదీ, షా నాయకత్వంలో విదేశీ కార్పొరేట్ బహుళజాతి కంపెనీలకు అడవులను, ఖనిజాలను ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ ప్రజలకు అందాల్సిన రాజ్యాంగ ఫలాలు వారికీ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో సంపన్నులు అధిక సంపన్నులుగా, పేదలు నిరుపేదలుగా మారుతున్నారని వాపోయారు. ఈ క్రమంలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, మహిళలు రాజ్యాంగ బద్ధంగా వారి హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. డీఎస్ఏ రాష్ట్ర కో కన్వీనర్ గణేశ్, అరుణ్, అనూష, కృష్ణ, ప్రవీణ్, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న తుకారాం గేట్ సీఐ శంకర్

అడ్డగుట్ట, మార్చి 21: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నతమైన విద్యను అభ్యసించే మంచి స్థాయికి చేరుకోవాలని తుకారం గేట్ సీఐ శంకర్ సూచించారు. శుక్రవారం సాయంత్రం తుకారం పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్లో బస్తీ వాసులకు, యువతకు సైబర్ క్రైమ్, ఇతర నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా తుకారం గేట్ సీఐ శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత నేరాల వైపు కాకుండా మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేయాలన్నారు. మాదక ద్రవ్యాలు బారిన పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు వీరయ్య, రౌతు రాజయ్య, జగన్నాథం, నారాయణ, మేకల చందర్ పాల్గొన్నారు.

## భావ కవిత్వ యువకర్త రాయప్రోలు సుబ్బారావు



ముషీరాబాద్, మార్చి 21: భావ కవిత్వ యువకర్త రాయప్రోలు సుబ్బారావు అని వంశీ అధినేత వంశీ రామరాజు అన్నారు. త్యాగరాయ గాన సభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా శుక్రవారం ఆధునిక కవి రాయప్రోలు సుబ్బారావు యాదిలో పేరిట సంస్థ జరిగింది. ఈ కార్యక్రమంలో వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని రాయప్రోలు సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లంకా లక్ష్మీనారాయణ, సుందర వల్లి శ్రీదేవి పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో శిశువు దహనం కేసు నిందితుడు

ముషీరాబాద్: ఎన్టీఆర్ స్టేడియంలో శిశువును దహనం చేసిన కేసులో పోలీసులు పురోగతి సాధించారు. నిందితుడు నల్గొండ జిల్లాకు చెందిన మైనర్ బాలుడిగా గుర్తించారు. ఎన్టీఆర్ స్టేడియం చుట్టుపక్కల ప్రాంతానికి చెందిన బాలికను ఫోన్ ద్వారా పరిచయం పెంచుకొని లోబరుచుకున్నాడు. తరచూ బాలికను బాలుడు కలువడంతో గర్భం దాల్చిన బాలిక శిశువుకు జన్మనిచ్చింది. కాగా పుట్టిన వెంటనే శిశువు చనిపోవడం గమనించి ఎన్టీఆర్ స్టేడియంలో శిశువు మృతదేహాన్ని దహనం చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి బాలుడిపై కేసు నమోదు చేశారు.

## వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం



తెలుగు పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

మారేడ్ పల్లి, మార్చి 21: మానవతా దృక్పథంతో పేద ప్రజలను ఆదుకోవాలని లక్ష్యంతో ఏర్పాటు అయిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా ఉన్నాయని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఓల్డ్ వాసవీ నగర్ లో శుక్రవారం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ బండారు దత్తాత్రేయ పంచాంగం ఆవిష్కరించడంతో పాటు, తక్షణ సహాయం, రక్షణ కవచం పేరుతో ఆపదలో ఉన్న వారిని ఆదుకునే సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది నేపథ్యంలో తెలుగు సంవత్సరాది నూతన పంచాంగాన్ని ముందస్తుగా ఆవిష్కరించినట్లు తెలిపారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా సాగుతున్న సేవా కార్యక్రమాలు అభినంద నీయమని అన్నారు. విద్య, వైద్యం లాంటి ఖర్చుతో కూడుకున్న విష యాలపై స్పష్టమైన వైఖరితో సేవ చేస్తున్న తీరు గొప్పదని కొనియా డారు. కార్యక్ర మంలో కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు బానుక నర్మదా, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## దుర్వాసనలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలి



కాలుష్య కారకాలపై సమీక్షిస్తున్న అధికారులు

అమీర్‌పేట్,మార్చి 21: బాచుపల్లి, మల్లంపేట ప్రాంతాల్లోని వివిధ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్య కారక దుర్వాసనల ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం టీజీపీసీబీ ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షించారు. కాజిపల్లి గడ్డపోతారం చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పరిశ్రమల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో టీజీపీసీబీ కి చెందిన జేసీ ఈఈ, ఆర్సీ పురం జోనల్ అధికారులు పాల్గొన్నారు. అన్ని పరిశ్రమలు దుర్వాసన నియంత్రణ చర్యలు తీసుకోవాలని, వీఓసి స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తమ సూచనలను డిఫాల్ట్ చేసే యూనిట్లపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ఆయా పరిశ్రమలను హెచ్చరించారు.

## ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో సింపోజియం





ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాలలో వేరువేరు పేర్లతో జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్టివల్ (సింపోజియం) ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పలు విభాగాలలో పోటీలు నిర్వహించారు. పోటీలు శుక్రవారం ప్రారంభమై రెండు రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ సింపోజియంలను అధ్యాపకులతో సంబంధం లేకుండా ఆయా విభాగాల విద్యార్థులే అధ్యాపకులు కేవలం సలహాదారులుగా వ్యవహరిస్తారని విద్యార్థులు వివరించారు. పరిశోధనల అనుభవాలను ఒక వేదికపై తీసుకువచ్చేందుకు ఈ సింపోజియంలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

## నిధులు మంజూరు చేయాలి

సికింద్రాబాద్, మార్చి 21 : సీ తాఫల్ మండిలో నిర్మిస్తున్న ప్రభుత్వ స్కూల్, కాలేజీ ల కొత్త భవనాల నిర్మాణం పనులకు నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు సీఎం రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డిని పద్మారావు గౌడ్ కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో జూనియర్, డిగ్రీ కాలేజీల ఏర్పాటును తన ప్రత్యేక విజ్ఞప్తి మేరకు గత ప్రభుత్వం చేపట్టి సీతాఫల్ మండి ప్రభుత్వ స్కూల్ ప్రాంగణం లోనే జూనియర్, డిగ్రీ కాలేజీలను నెలకొల్పినట్లు పద్మారావు గౌడ్ వివరించారు. నిధులు సమకూర్చి పనులు వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, వెంటనే నిధులను కేటాయించేందుకు హామీ ఇచ్చారని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.


## ఆందోళనలో అసాంఘిక శక్తుల ప్రవేశం



మాట్లాడుతున్న డీసీపీ డాక్టర్ బాలస్వామి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అన్ని రకాల ఆందోళనలను నిషేధిస్తూ అధికారులు జారీ చేసిన సర్క్యులర్ కు వ్యతిరేకంగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసనల్లో అసాంఘిక శక్తులు చేరే అవకాశం ఉందని ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. పరిస్థితులను దెబ్బతీసి, ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నాలు జరగవచ్చని అన్నారు. ఈ విషయాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఓయూ ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ జగన్, సీఐ రాజేందర్ లతో కలిసి ఆయన మాట్లాడారు. వారం రోజులుగా యూనివర్సిటీ లో జరుగుతున్న ఆందోళనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## ఎలివేటెడ్ బాధితులకు న్యాయం చేయాలి



న్యాయం చేయాలని కోరుతున్న బీఆర్ఎస్ నాయకుడు విజయ్

బొల్లారం, మార్చి 21: జాతీయ రహదారి పారడైజ్ నుంచి డెయిరీ ఫార్మ్ రోడ్డు వరకు చేపట్టబోయే ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నష్టపోతున్న బాధితులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు విజయ్ సంబంధిత అధికారులను కోరారు. కంటోన్మెంట్ ఒకటో వార్డు న్యూ బోయిన్‌పల్లి సంజీవయ్య నగర్ చిన్న తోట కమ్యూనిటీ హాలులో ల్యాండ్ అక్విజేషన్ అధికారి రాజేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ముకుంద రెడ్డి, సర్వేయర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. విజయ్ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టబోయే ప్రాంతాలలో 200 ఫీట్ల నుంచి 100 ఫీట్లకు తగ్గించాలని కోరారు.

## 27న ఓయూలో పీడీఎస్‌యూ సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీడీఎస్‌యూ సదస్సును ఈనెల 27న నిర్వహించనున్నారు. వాల్‌పోస్టర్‌ను ఆర్ట్స్‌కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దుబ్బా రంజిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయల స్వయంప్రతిపత్తితోనే విద్యా రంగం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాల సమస్యలను ఏమాత్రం పట్టించుకోకుండా సమస్యల సుడిగుండంలో వదిలేసిన కేంద్ర ప్రభుత్వం నేడు రాష్ట్ర యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే విధంగా యూజీసీ నూతన నిబంధనలను రూపొందించిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి గణేశ్ నాయకులు సైదులు, వంశీ, సుధీర్, సమన్, ఉదయ్ ప్రవీణ్, సిద్ధు ,స్వాతి, వినీత తదితరులు పాల్గొన్నారు.

## శేషగిరికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జయసింహ

చిక్కడపల్లి, మార్చి:21: కమాండెంట్ ఎంవీ శేషగిరి వర్ధంతి కార్యక్రమం శుక్రవారం చిక్కడపల్లిలో జరిగింది. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ హాజరై శేషగిరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేశ్ కుమార్, పోతుల శ్రీకాంత్ ,ఎం వి అశోక్ కుమార్, శ్రీనివాస్ ,ఆకుల శ్రీనివాస్ ,పున్న సత్యనారాయణ, పున్న రామ్మోహన్, ఎర్రం శ్రీనివాస్ గుప్త ,ముచ్చకుర్తి ప్రభాకర్ వడ్డపల్లి దినేశ్, కిశోర్, రాము ,సాయి ,చాణక్య రెడ్డి సాయి యాదవ్ భాను తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై నిర్లక్ష్యం చేస్తే పోరాటం తప్పదు




మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

చిక్కడపల్లి, మార్చి 21: రాష్ట్రంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. రైతు రాజు కానీ ఆ రైతుకి మన దేశంలో రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమితి గౌరవ అధ్యక్షుడు ఓర్సు ఇంద్రసేనా అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ముఖ్యఅతిథిగా జస్టిస్ చంద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజాసంఘాలతో , రాజకీయ పార్టీలతో కలిసి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబం వరంగల్ జిల్లా, దుగ్గొండి మండలం, మాంధాపురం గ్రామానికి చెందిన గంధం లక్ష్మి కుటుంబానికి జస్టిస్ చంద్రకుమార్ ఆర్థిక సహాయం అందించారు.

## 'హామీల అమలుకు సరిపడని బడ్జెట్'

చిక్కడపల్లి, మార్చి 21: ఎన్నికల సమయంలో ప్రజలకు అమలు కానీ హామీలిచ్చి, బడ్జెట్లో మాత్రం ఆ వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకుండా అంకెల గారడీతో జనాన్ని మోసం చేయటం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రివాజుగా మారిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు ప్రజలకిచ్చిన వాగ్దానాలు అనే అంశంపై రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడారు కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలున్నాయని అన్నారు. సామాన్య ప్రజలు అంటే ఈ ప్రభుత్వాలకి లెక్కలేదని విమర్శించారు. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసే విధంగా వాటిని సవరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన వాటా, విభజన హామీల అమలు, అందుకు తగిన విధంగా కేటాయింపులు లేవని చెప్పారు.సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డీజీ సర్సింహరావు, బాబురావు పాల్గొన్నారు.

## ప్రత్యేక కోర్సుల అధ్యయనానికి ఒప్పందం



ముషీరాబాద్, మార్చి 21: విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేపీ 21 ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీల మధ్య కోర్సుల సహకారానికి పరస్పర ఒప్పందం కుదిరింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె .ప్రభుతో వివిధ కోర్సులలో పరస్పర సహకారానికి శుక్రవారం ఒప్పందం జరిగింది. ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాలు సంయుక్తంగా సమన్వయం చేశాయి. ఈ ఒప్పందంలో భాగంగా న్యాక్ ఫౌండేషన్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కరెంట్ అఫైర్స్, సాఫ్ట్ స్కిల్స్ డెవలప్ మెంట్ కోర్సులలో విద్యార్థులకు తర్ఫీదును ఇవ్వనున్నారు. చంచల్ గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు డా. వెంకటరమణ, కోఆర్డినేటర్, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాధిపతి డా. పి. పద్మజ, వైస్ ప్రిన్సిపల్ డా.ఆర్.లావణ్య అధ్యాపకులు ఏ. తిరుపతి, డా.జగన్ తదితరులు పాల్గొన్నారు.

## డౌన్ సింద్రోమ్ దినోత్సవం

బొల్లారం, మార్చి 21: జాతీయ మేధో దివ్యాంగుల సాధికారిత సంస్థ (నిపిడ్), బోయిన్ పల్లి కేంద్రంలో శుక్రవారం ప్రపంచ డౌన్ సింద్రోమ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిపిడ్ డైరెక్టర్ డా. బి.వి. రామ్ కుమార్ హాజరై విద్యార్థుల తల్లిదండ్రులు,సిబ్బందిని ఉద్దేశించి డౌన్ సింద్రోమ్‌ను తొందరగా గుర్తించడం, తగిన విధంగా చర్యలు తీసుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

## స్టేషనరీ అందజేత



బన్సీలాల్ పేట్, మార్చి 21 : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ అధ్యక్షుడు శేరిపల్లి గణేశ్ పద్మశాలి అన్నారు. శుక్రవారం భోలక్ పూర్ లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టేషనరీ ని ఆయన అందజేశారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంపా నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు.

## గడువు పొడిగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని 2018 బ్యాచ్ పరిశోధక విద్యార్థులకు సబ్‌మిషన్ గడువును పొడిగించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏబీవీపీ ఓయూ అధ్యక్ష కార్యదర్శులు దృహన్, శివశంకర్ మాట్లాడుతూ 2018లో అడ్మిషన్ పొందినప్పటికీ రెండేళ్ల తరువాత అంటే 2021 లో ప్రీ పీహెచ్డీ పరీక్షను నిర్వహించారని గుర్తు చేశారు. కరోనా కారణంగా రెండేళ్ల విలువైన సమయం వృథా అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు.